www.samasamajam.in

# సమ సమాజం

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | శని వారం 09 జూలై 2022 | ఎడిటర్: గోనుకొండ పృథ్విరాజు | సంపుటి - 07, సంచిక-99 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## గ్యాస్ ధరపై 2వ రోజు టీఆర్ఎస్ ఆందోళనలు



హైదరాబాద్, జూలై 8 (సమ సమాజం): కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలపై ప్రజలు భగ్గుమంటున్నారు. నిత్యావసర ధరలు పెంచుతూ సామాన్యుడి పొట్టగొడుతున్న బీజేపీ పార్టీ, ప్రధాని మోదీపై జనం కన్నెర్ర జేస్తున్నారు. వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా ఉద్యమిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా టీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన నిరసన కార్యక్రమాల్లో ప్రజలు ఎక్కడికక్కడ స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు. పెంచిన వంట గ్యాస్ ధర తగ్గించాలనే డిమాండ్ తో రోండోరోజు తెలంగాణ వ్యాప్తంగా పెద్ద ఆందోళనలు చేట్టారు. కట్టెల పొయ్యిపై వంట చేస్తూ నిరసన తెలిపారు. జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెంచిన గ్యాస్ ధరలు తగ్గించకుంటే బీజేపీకి బుద్ధి చెబుతామన్నారు. ధరలు తగ్గించే వరకు ఉద్యమిస్తాని నినదించారు.

## పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలి

- రెవెన్యూ సదస్సుల్లో దీనిని చేర్చాలి
- సిఎం కెసిఆర్‌కు బండి సంజయ్ లేఖ



హైదరాబాద్, జూలై 8 (సమ సమాజం): ఈ నెల 15 నుంచి నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో పోడు రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని సీఎం కేసీఆర్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ లేఖ రాశారు. గిరిజనులకు పట్టాలు ఇస్తామన్న హామీలను నిలుపుకోవాలని కోరారు. పోడు భూములకు పట్టాలపై తాము చేసిన పోరాటాల వల్లే ప్రభుత్వం 2021 నవంబర్ లో గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించిందని చెప్పారు. అయితే ఇప్పటికే సమస్యలకు పూర్తి పరిష్కారం లభించలేదన్నారు. 2018 నవంబర్ 23న మహబూబాబాద్ బహిరంగ సభలో అవసరమైతే కుర్చీలు వేసుకొని మరీ పోడు రైతులకు పట్టాలు ఇస్తామన్న కేసీఆర్ హామీని సంజయ్ గుర్తు చేశారు. పట్టాలు ఇస్తామంటే, కుర్చీలు ఏర్పాటు చేయడానికి బీజేపీ, గిరిజనులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వడానికి వీలుగా రెవెన్యూ సదస్సుల్లో రెవెన్యూ అధికారులతో పాటు ఫారెస్ట్ అధికారులను భాగస్వామ్యం చేయాలని సూచించారు.



దేశం మారుతుంది..

## నిలకడగా లాలూ యాదవ్ ఆరోగ్యం

### వెల్లడించిన కుటుంబ సభ్యులు

న్యూఢిల్లీ, జూలై 8 (సమ సమాజం): బీహార్ మాజీ సీఎం, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఆయన కుమార్తె మీసా భారతి వెల్లడించారు. ఇతరుల సహాయంతో ఆయన నిలబడగలుగుతున్నారని తెలిపారు. గతంలో కంటే లాలూ ఆరోగ్యం ప్రస్తుతం మెరుగ్గా ఉందని భారతి

2

## వైఎస్ కోసం సెంటు స్థలం కూడా ఇవ్వరా

- స్మరించుకునేందుకు జాగానే లేదా
- కెసిఆర్, రేవంత్‌ల తీరుపై మండిపడ్డ షర్మిల
- లోటస్‌పాండ్‌లో వైఎస్సార్‌టీపీ ఆవిర్భావ వేడుకలు



హైదరాబాద్, జూలై 8 (సమ సమాజం): వైఎస్‌ను స్మరించుకోవడానికి హైదరాబాద్‌లో సెంటు భూమి కూడా లేదా అని టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల సూటిగా ప్రశ్నించారు. లోటస్‌పాండ్‌లో వైఎస్సార్‌టీపీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌టీపీ పార్టీ జెండాను షర్మిల ఆవిష్కరించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్ సంక్షేమ పాలన ప్రతి గడపను... ప్రతి గుండెను తాకిందని చెప్పారు. వైఎస్సార్ సువర్ణ పాలనను ప్రజలు గుర్తించారని తెలిపారు. వైఎస్ సేవలను ప్రభుత్వాలు మాత్రం గుర్తించలేదని దుయ్యబట్టారు. హైదరాబాద్ కేంద్రంగా వైఎస్సార్ సువర్ణపాలన అందించారని షర్మిల పేర్కొన్నారు. కాంగ్రెస్, టీఆర్ఎస్ ప్రభుత్వాలు వైఎస్ సేవలను విస్మరించాయని షర్మిల మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ఒక బ్లాక్ మెయిలర్..ఏసీబీ కేసులో అడ్డంగా దొరికిపోయాడని

2

## తెలంగాణ హైకోర్టులో ఎంపీ రఘురామకు చుక్కెదురు

### క్వాష్ పిటిషన్‌ను కొట్టివేసిన కోర్టు



హైదరాబాద్, జూలై 8 (సమ సమాజం): వైకాపా ఎంపీ రఘురామకృష్ణరాజుకు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. ఆయన వేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఏపీ ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు ఆయనపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. కేసులో రఘురామ కుమారుడు భరత్, పీఏ శాస్త్రి, సీఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ,

2

## బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

- చురుగ్గా కదులుతున్న రుతపవనాలు
- తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు



హైదరాబాద్/విశాఖపట్టణం, జూలై 8 (సమ సమాజం): బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం, రుతుపవనాలు చురుగ్గా ఉండడంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. తెలుగురాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం కోస్తా, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు పడతాయన్నారు. తెలంగాణలోని యాదాద్రి, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, సూర్యాపేట, జనగాం, నల్గొండ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. హైదరాబాద్‌లో శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఆఫీస్‌లకు, స్కూళ్లకు వెళ్లే సమయం కావడంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతు న్నారు. మూడు రోజులపాటు రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడనున్నట్లు హైదరాబాద్ వాతవరణశాఖ పేర్కొంది. దక్షిణ ఒడిశా, ఉత్తర కోస్తాకు ఆనుకుని వాయువ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల

2

## హీరో చియాన్ విక్రమ్‌కు గుండెపోటు

### చెన్నై ఆస్పత్రికి తరలింపు




చెన్నై, జూలై 8 (సమ సమాజం): స్టార్ హీరో చియాన్ విక్రమ్ గుండెపోటుకు గురయ్యారు. దీంతో ఆయనను కుటుంబ సభ్యులు హుటాహుటిన చెన్నైలోని కావేరి ఆస్పత్రికి తరలించారు. విక్రమ్‌కు ఐసీయూలో వైద్యులు చికిత్స అందిస్తున్నట్లు తమిళ మీడియా పేర్కొంది. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. సాయంత్రం 6 గంటలకు జరగాల్సిన పొన్నియిన్ సెల్వన్ టీజర్ లాంచ్‌కి విక్రమ్ హాజరు కావాల్సి ఉండగా

2

## వెనకబడిన వర్గాలకు సీఎం కేసీఆర్ ఆత్మ గౌరవం

- కుల సంఘాలకు భవన నిర్మాణ అనుమతి పత్రాలు
- అందచేసిన మంత్రులు గంగుల కమలాకర్, శ్రీనివాసగౌడ్





హైదరాబాద్, జూలై 8 (సమ సమాజం): తెలంగాణలో వెనకబడిన వర్గాలకు సీఎం కేసీఆర్ ఆత్మ గౌరవం కల్పించారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. ఏక సంఘంగా ఏర్పడిన మున్నూరుకాపు, పెరిక, తెలంగాణ మరాఠ మండలి, కుమ్మరి శాలివాహన, విశ్వబ్రాహ్మణ, ఆరేటి క్షత్రియ కుల సంఘాలకు ఆత్మగౌరవ భవన నిర్మాణ అనుమతి పత్రాలను మంత్రులు గంగుల కమలాకర్, శ్రీనివాస్ గౌడ్ కలిసి అందజేశారు. నగరంలోని ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. ఇప్పటికే 24 కుల సంఘాలు ఏక సంఘంగా ఏర్పడి అనుమతి పత్రాలు తీసుకున్నాయని తెలిపారు. మిగతా కులాలు సైతం మరో వారం రోజుల్లోపు ఏక సంఘంగా ఏర్పడాలని పిలుపునిచ్చారు. ఈ చివరి అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. లేనిపక్షంలో వాటి నిర్మాణాలకు టెండర్లు పిలిచి వారం తర్వాత ప్రభుత్వమే చేపడుతుందని తెలియజేశారు. దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా 41 కులాలకు హైదరాబాద్ నడిబొడ్డున వేల కోట్లు విలువ చేసే 82.30 ఎకరాల స్థలాన్ని కేటాయించడమే కాకుండా భవన నిర్మాణాన్ని సైతం ఆయా కుల సంఘాలకే అప్పగించి నిధుల్ని సైతం ఇస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమే అన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని వెనుకబడిన వర్గాల ఆత్మ గౌరవం సూచించేలా కులాల ఇష్ట ప్రకారం ప్రత్యేక నమూనాలతో భవనాలను నిర్మించుకోవాలన్నారు. ఈ ఆత్మగౌరవ భవనాలు హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఆయా కుల సంఘాలకు విద్యాపరంగాను, సామాజికంగానూ, సాంస్కృతికపరంగానూ, వసతిలో కూడా అత్యుత్తమ సేవలు అందిస్తాయన్నారు. మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. మహాత్మ జ్యోతిబాపూలే చేసిన రీసెర్చ్ ప్రకారం మన

2

# హామీలు.. స్వాహా

## విజన్ డాక్యుమెంట్ హామీలతో ప్రజలకు కుచ్చుటోపి

### మీడియా ముందుకు వచ్చి వివరణ ఇచ్చుకోలేని స్థితిలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి







- గట్టుప్పల్‌ను మండలంగా ఏర్పాటు చేయటంలో విఫలం
- ప్రజా పాలనకు దూరంగా ఎమ్మెల్యే
- మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులకు భరోసా కరువు
- మానుఫెస్టో హామీల అమలులో ఘోర వైఫల్యం
- పదవికోసం కాలయాపన చేస్తే తన రాజకీయ ఉనికికే ప్రమాదం అంటున్న విశ్లేషకులు

నల్లగొండ, జూలై 7 (సమసమాజం): మునుగోడు నియోజకవర్గం ప్రజలకు సొంత నిధులతో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటానని పలు సందర్భాలలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి చెప్పిన సంగతి విదితమే.

> "మౌనం వీడని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిపై విమర్శలు గుప్పుమంటున్నాయి. మౌనం అంగీకారం అన్నట్లు... నాడు ఓట్లకోసం నానా హామీలు ఇచ్చి నేడు వివరణ ఇచ్చుకోలేక మౌనంగా ఉంటున్నాడా !. ఓ వైపు అదిష్టానం నుంచి సానుకూల పరిస్థితులు లేక, మరో వైపు ఏ పార్టీలోకి జంప్ అవ్వాలో అర్థం కాక, ఇంకోవైపు మునుగోడు నియోజకవర్గంలోని కాంగ్రెస్ శ్రేణులను సమన్వయం చేసుకోవడంలో విఫలమై విశ్వాసాన్ని కోల్పోతూ చీత్కారాలకు గురౌతున్నాడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి. అంతెందుకు నియోజక వర్గంలోని పలు గ్రామాలను ఇప్పటివరకు పర్యటించలేదంటే సదరు ఎమ్మెల్యే పాలన ఎంత దారుణంగా ఉందో ఇట్లే అర్థమౌతుంది.

**పదవి కోసమా ! మునుగోడు అభివృద్ధి కోసమా !**

ఇప్పటివరకు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మీడియా ముందుకువచ్చి వివరణ ఇచ్చుకుంటే ప్రజలు హర్షం వ్యక్తం చేస్తారు. అభివృద్ధికి టీఆర్ఎస్ ప్రభుత్వం సహకరించడం లేదని ఎమ్మెల్యే భావిస్తే పదవిలో కొనసాగడం ఎందుకు అని పలువులు అభిప్రాయపడుతున్నారు. అభివృద్ధిలో పాలుపంచుకోకుండా పదవికోసం కాలయాపణ చేస్తే తన రాజకీయ ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**ఓట్లు దండుకొని.. మొఖం చాటేసిన ఎమ్మెల్యే**

ఎమ్మెల్యే విజన్ డాక్యుమెంట్ హామీలను నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు దొరకకుండా మొఖం చాటేసుకు తిరుగుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి హామీలు.

**2018 ఎన్నికల మ్యానిఫెస్టోలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి చేసిన వాగ్దానాల్లో చండూర్ మండల ప్రధాన హామీలు:**

- ప్రత్యేక మండలంగా గట్టుప్పల్
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణం, మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు
- 30 పడకలతో ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి అత్యాధునిక వైద్య సదుపాయాల కల్పన
- బెండలమ్మ చెరువుని పూర్తి చేయటం ద్వారా గొల్ల గూడెం, పుల్లంల, బంగారిగడ్డ, తాస్కానిగూడెం గ్రామాలలో భూగర్భ జలాల వృద్ధి
- వెల్మకన్నె నుండి కొండాపురం ఫీడర్ ఛానెల్ పూర్తి చేయటం ద్వారా కొండాపురం, పుల్లంల, బోడంగిపర్తి గ్రామాలలో భూగర్భ జలాలు వృద్ధి
- శేషిలేటి వాగు నుండి కస్తాల చెరువులోకి ఫీడర్ ఛానెల్ నిర్మాణం
- కొత్తగా ఏర్పడిన చండూరు మునిసిపాలిటి సుందరీకరణ, పూర్తిస్థాయిలో అభివృద్ధి
- చండూరు నుండి తుమ్మలపల్లి రామలింగేశ్వర దేవస్థానం వరకు రోడ్డు నిర్మాణం
- పుల్లెముల నుండి బోడంగిపర్తి, పుల్లెంల నుండి తాస్కానిగూడెం, బోడంగిపర్తి నుండి శిర్దేపల్లి, దోనిపాముల నుండి జోగిగూడెం నుండి తిమ్మారెడ్డిగూడెం, నెర్మట నుండి శేరిగూడెం వరకు, ఉడుతలపల్లి నుండి దుబ్బగూడెం రెగట్టె వరకు రోడ్డు నిర్మాణం, కస్తాల నుండి చొప్పరిగూడెం, పోచంపల్లి వరకు రోడ్డు నిర్మాణం.

DAY 2

పైన తెలిపిన హామీలు అన్ని చండూర్ మండలానికి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఇచ్చిన హామీలు. ఇందులో కొన్ని పనులను సొంత నిధులతో ఏర్పాటు చేస్తానని చెప్పి కొంత మేరకు సహకరించినా.. అనుకున్నంత ఆశాజనకంగా పని చేయలేదని చండూరు మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉంటే చండూరు మండలంలో ప్రధాన అంశం గట్టుపల్ మండలం, ఈ అంశంలో ఎమ్మెల్యే చేసింది గోరంత.. చెప్పేది కొండంత. మిగతా హామీలు ఏవి కూడా తనకు పట్టనట్టుగా ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి గాలికి వదిలేశారు. (కథనం కొనసాగింపు.. రేపటి సంచికలో)

# సంపాదకీయం

## రూపాయి పతనంతో భారంగా మారిన ఉన్నత విద్య !

చదువుకుని తమకాళ్లమీద తాము నిలబడాలన్న లక్షలాది విద్యార్థులకు ప్రభుత్వాల విధానాలు గుదిబండలుగా మారాయి. ఉన్నత చదువులు భారంగా మారుతున్నాయి. విదేవాలకు వెళ్లాలనుకున్న వారికి సవాల్‌గా మారింది. డబ్బున్నవాళ్లే చదువుకునేలా ప్రభుత్వ విధానలు ఉన్నాయి. పేదలు, మధ్య తరగతి వాళ్లు ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా విదేశాలకు వెళ్లి చదువుకునే పరిస్థితితులు కానరావడం లేదు. ఇక్కడ ఇంజనీరింగ్, మెడిసిన్ పూర్తి చేసి లేదా ఇతర డిగ్రీలతో విదేశాలకు వెళ్లాలనుకున్న వారికి ప్రధానంగా రెండు సమస్యలు ఎదురవుతున్నాయి. ఒకటి రుణాల కోసం బ్యాంకులు సజావుగా స్పందించడం లేదు. నానా యాతన పడాల్సి వస్తోంది. డబ్బున్న వారికి రుణాలు అందుతున్నాయి. కానీ పేదలు, మధ్య తరగతి వారికి రుణాలు ఇవ్వడం లేదు. ఇకపోతే రుణం పొందినా..దాని వడ్డీ తడిసిని మోపెడు అవుతోంది. విదేశాలకు వెళ్లి, చదువు పూర్తి చేసుకుని, ఉద్యోగం సంపాదించి వచ్చే సరికి రుణభారం పెరుగుతోంది. దీంతో అతను సంపాదన ఇది చెల్లించడానికే సరిపోతుంది. మరోవైపు పెరిగిన డాలర్ విలువ, రూపాయి పతనంతో అధికంగా రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తెఓంది. బేటీపడావో బేటీ బచావో అంటున్న ప్రధాని మోడీ ఆడపిల్లల చదువుల ఖర్చుల గురించి ఆలోచించడం లేదు. ఈ పరిస్థితుల్లో వడ్డీలేని రుణాలను లేదా నామమాత్రం వడ్డీతో ఉన్నత చదువులకు ఆర్థిక సాయం అందించేలా పథకాలు రూపొందాలి. మరోవైపు భారత ఆర్థిక వ్యవస్థ కుదేలు కావడంతో పాటు, ద్రవ్యోల్బణం పెరగడంతో నిత్యావసర వస్తువుల ధరలు అమాంతంగా పెరిగాయి. బంగారం ధరలు మరింతగా పెరుగుతున్నాయి. వైద్య సేవలు విపరీతంగా పెరిగాయి. అలాగే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు కూడా ఎప్పటికప్పుడు పెంచడంతో సామాన్యుల బతుకులు బుగ్గి అవుతున్నాయి. దీంతో సామాన్యులకు ఊరడింపు దక్కడం లేదు. దేశాన్ని 2025 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారుస్తానని ప్రధాని మోడీ ప్రకటించారు.. కానీ దేశం ఇంకా మూడు ట్రిలియన్ డాలర్ల మార్కే దాటలేదు. పన్నుల భారం మోయలేక ప్రజల నడ్డి విరుగుతున్నది. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఆర్థికరంగాన్ని నిలబెట్టేలా లేవు.ఎడాపెడా పన్నులు విధించడంలో ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు ఊపిరాడని స్థితికి చేరింది. ఇదంతా ఒక ఎత్తయితే విదేవీ విద్యార్థులకు డాలర్ మారకం తీరని భారంగా మారింది. ఉన్నత చదువులకు వెళ్లాలనుకునే వారికి డాలర్ మారకం 80 రూపాయలకు చేరడంతో తట్టుకోలేక పోతున్నారు. ఫీజులను డాలర్లలో చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ఫీజలు భారం తడిసి మోపెడు అవుతోంది. ఏటా వేలాదిమంది మనదేశం నుంచి అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాలకు వెళుతుంటారు. వీరికి డాలర్ ఒక్కటే శరణ్యం. డాలర్ రేటు పెరగడం వల్ల ప్రతి ఒక్క విద్యార్థిపై అదనపు భారం పడుతోంది. దీనికితోడు విదేశీయానం కూడా భారంగా మారింది. ఇంధన ధరల వల్ల విమానరంగం టిక్కెట్లను అమాంతంగా పెంచేసింది. దీంతో అమెరికా వెళ్లాలనుకున్న వారఇక్ఇ అదికూడా భారంగా మారింది. అసమర్థ విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్థంగా మారుతోంది. ధరలు కొండెక్కాయి. టోకు ద్రవ్యోల్బణం మూడు దశాబ్దాల గరిష్ఠానికి చేరింది. వృద్ధి సంగతి అటుంచితే, అన్ని లోట్లు పెరిగిపోయాయి. కేంద్ర ప్రభుత్వ ద్రవ్యలోటు పూడ్చలేనంతగా పెరిగిపోయింది. కరెంట్ ఖాతా లోటు, వాణిజ్య లోటు వాటి లోతెంతో చూపిస్తున్నాయి. విదేశీ రుణం పెరిగిపోయింది. రూపాయి నిలువునా పతనమయ్యింది. రూపాయి మారకం అమెరాకి డాలర్‌తో పోలిస్తే 80 కి చేరుకుంది. వీటికితోడు హఠాత్తుగా చమురు, పెట్రో కంపెనీలపై రూ.లక్ష కోట్ల ఆదాయాన్ని తెచ్చేందుకు పన్నులు వడ్డించారు. బంగారంపై సుంకాలు వేసి ధరలు పెంచేశారు. జీఎస్టీ మినహాయింపులో ఉన్న నిత్యావసరాలపై కూడా పన్ను వేశారు. ఆర్థిక మంత్రి చెప్పినట్టు కేంద్ర ప్రభుత్వానికిది ఇప్పుడు అసాధరణ పరిస్థితే. ఆర్థిక వ్యవస్థను ఎలా గాడిన పెట్టాలో దిక్కుతోచని స్థితి ఏర్పడింది. వచ్చే కొద్ది నెలల్లో అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు మాంద్యంలో చిక్కుకొంటే, భారత ఆర్థిక వ్యవస్థ సైతం తీవ్ర సంక్షోభంలోకి జారుకొంటుందని విశ్లేషకులు అంటున్నారు. బ్యాంకింగ్, కరెన్సీ, రుణ సంక్షోభాలు ముంచెత్తుతాయని అంతర్జాతీయ సంస్థలు హెచ్చరిస్తున్నాయి. కేంద్ర తక్షణమే దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే వృద్ధి రేటు కుప్పకూలుతుందని రిజర్వ్‌బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ రాజన్ కూడా హెచ్చరించారు. ఈ ఆరు నెలల్లో రూపాయి 6 శాతం క్షీణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో 40-50 బిలియన్ డాలర్లు కేవలం రూపాయిని ఆపడా నికే ఖర్చు చేయాల్సి ఉంటుందని ఒక అంతర్జాతీయ సంస్థ అంచనా వేసింది. డాలర్ విలువ ప్రధానంగా విదేశాలకు వెళ్లి విద్యను అభ్యసించా లనుకునే వారికిగుదిబండగా మారింది. రికార్డుస్థాయికి చేరిన మన విదేశీ మారక నిల్వలు ఇప్పుడు హారతి కర్పూరంలా కరిగిపోతున్నాయి. రూపాయి అదుపునకు ఆర్బీఐ యథేచ్ఛ గా డాలర్లను వెదజల్లడం, విదేశీ ఇన్వెస్టర్లు డాలర్లను తరలించుకుపోవడంతో ఇప్పుడు మన వద్ద ఫారెక్స్ నిల్వలు 590 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. దీనికితోడు ష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ప్రపంచ మార్కెట్లో అనేక వస్తువుల ధరలు పెరిగిపోయాయి. ముడి చమురు నిల్వలు, బొగ్గు నిల్వలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ముందుచూపు లేకుండా వ్యవహరించడంతో దిగుమతుల బిల్లు భారీగా పెరిగింది. దీంతో ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో వాణిజ్యలోటు ఎన్నడూ లేనంతగా 70.25 బిలియన్ డాలర్లకు చేరినట్టు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇలా ఒకదాని వల్ల మరొకటి పెరిగిపోవడం, తద్వారా రూపాయి మరింత క్షీణించడం, ధరలు ఆకాశాన్నంటడం చకచకా జరిగిపోతాయని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో విదేశీ చదువుకు వెళ్లే విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని పథకాలు రచించాలి. ఇక్కడ ఎలాగూ ఉద్యోగాలు, ఉపాధి దక్కడం లేదు..కనీసం విదేశాలకు వెళ్లే వారికి అయినా తోడ్పడితే అది దేశానికి మంచిది.

పృద్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# వెనకబడిన వర్గాలకు సీఎం కేసీఆర్ ఆత్మ గౌరవం




(మొదటి పేజీ తరువాయి) కులాలన్నీ ఒకే ఇంటి నుండి ఉద్భవించాయని తెలిపారు. వృత్తుల పరంగా వేరుపడి తర్వాత కులాల రూపాన్ని సంతరించుకున్నాయన్నారు. అందుచేత వెనుకబడిన వర్గాలంతా ఒక్కటే అని, ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. కులంలో ఎదిగే వాళ్లకు అండగా నిలబడాలి కానీ అడ్డుపడకూడదని ఆకాంక్షించారు. కుల రహిత సమాజం కోసం పాటుపడుతూ కులాంతర వివాహాలు ప్రోత్సహించాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రోద్బలంతో ఒకే తాటిపైకి వచ్చిన వెనుకబడిన కులాలు ఇకముందు అదే ఆత్మగౌరవాన్ని ప్రదర్శించాలన్నారు. టీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ వేలకోట్ల విలువైన స్థలాల్ని, నిధుల్ని వెనుకబడిన వర్గాలకు ఇచ్చారని పేర్కొన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కులం ఆత్మగౌరవం ప్రతిఫలించేలా భవన నిర్మాణాలను చేసుకోవాలన్నారు. మాజీ స్పీకర్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి మాట్లాడుతూ.. కుల సంఘాల్ని ఆత్మగౌరవ భవనాల కోసం ఏకతాటిపైకి తెచ్చిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, మంత్రి గంగుల కమలాకర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఐక్యంగా ఉండడం అభివృద్ధికి దారితీస్తుందని, ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయం కూడా అదే అని అన్నారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ అనుమతి పత్రాలు అందుకున్న కుల సంఘాలు మంత్రులను, ఇతర ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కోరుకంటి చందర్, సాహిత్య అకాడమీ ఛైర్మన్ జూలూరి గౌరీశంకర్, జల వనరుల సంస్థ ఛైర్మన్ వి.ప్రకాశ్, బీసీ కమిషన్ సభ్యుడు ఉపేంద్ర, ఇతర బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు, ఆరు కుల సంఘాల నేతలు ప్రతినిధులు, పెద్ద ఎత్తున బీసీలు పాల్గొన్నారు.

# వైఎస్ కోసం సెంటు స్థలం కూడా ఇవ్వరా




(మొదటి పేజీ తరువాయి) విమర్శించారు. ఆయన మాటలు ఎవరు నమ్మరంటూ ఫైర్ అయ్యారు. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఒక దొంగ అని..రేవంత్ రెడ్డి కంటే రోశయ్య బెటర్ అని షర్మిల అన్నారు. తమ పార్టీ ఏడాదిలో ఎంతో పురోగతి సాధించిందని.. తెలంగాణ ప్రజల పక్షాన నిలబడే పార్టీగా పేరు తెచ్చుకుందని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలను వైఎస్సార్టీపీ ఎత్తిచూపిందని.. తమ పోరాటం వల్లే పాలక, ప్రతిపక్ష పార్టీలకు సోయి వచ్చిందంటూ మండిపడ్డారు. నిరుద్యోగుల కోసం మూడు రోజులపాటు నిరాహారదీక్ష చేసినట్లు షర్మిల తెలిపారు. ప్రజలకు మేమున్నాము అని ధైర్యం చెప్పడానికే పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. కోట్లమంది ప్రజల గుండెల్లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి బతికే ఉన్నారని అన్నారు. అయితే వైఎస్సార్ ఇచ్చిన అధికారాన్ని అనుభవించిన కాంగ్రెస్ ఆయనకు కనీసం మెమోరియల్ ఘాట్ కూడా ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. సీఎం కేసీఆర్ కూడా రాజశేఖర్ రెడ్డికి సంబంధించిన స్థలాన్ని వెనక్కి తీసుకున్నారని ఆరోపించారు. 2004లో కాంగ్రెస్‌తో జతకట్టిన తర్వాతే టీఆర్ఎస్ బలపడిందని..కానీ ఆ మహనేతకు ఇచ్చిన స్థలాన్ని కూడా వెనక్కి తీసుకోవడం దారుణమన్నారు. సరిగ్గా గత ఏడాది జూలై 8న వైఎస్సార్ టీపీని షర్మిల స్థాపించారు. పార్టీ స్థాపించిన తొలిరోజు నుంచి షర్మిల అనేక ఉద్యమాలు నిర్వహిస్తున్నారు. నిరుద్యోగులకు మద్దతుగా నిరాహార దీక్ష చేశారు. ఆత్మహత్య చేసుకున్న రైతాంగం కోసం పరామర్శ యాత్ర, చిన్నారులపై లైంగిక దాడుల సందర్భంగా నిరసనలు.. ఇలా అన్ని సందర్భాల్లో ప్రభుత్వ వైఫల్యాలను షర్మిల గట్టిగా నిలదీస్తున్నారు. 3500 కిలోమీటర్ల ప్రజాప్రస్థానం యాత్రను ప్రారంభించి 116 రోజుల్లో 1500 కిలోమీటర్లకు పైగా పాదయాత్ర పూర్తి చేసిన షర్మిలకు గ్రామగ్రామాన విశేష ఆదరణ లభిస్తోంది. ప్రజలను చైతన్యవంతం చేస్తున్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం గత ఎనిమిదేళ్లుగా చేసిన వాగ్దానాలలో వేటినీ పూర్తి చేయని విషయాన్ని ఆమె ప్రజలకు గుర్తు చేస్తున్నారు.

## తెలంగాణ హైకోర్టులో ఎంపీ రఘురామకు చుక్కెదురు

(మొదటి పేజీ తరువాయి)కానిస్టేబుల్‌ను నిందితులుగా చేర్చారు.విధి నిర్వహణలో భాగంగా తాను బౌల్డర్‌హిల్స్ వద్ద ఉండగా నలుగురు వ్యక్తులు వచ్చి తనను కారులో ఎక్కించుకొని రఘురామ ఇంట్లోకి తీసుకెళ్లి, చిత్రహింసలకు గురి చేశారని ఏపీ ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ ఎస్‌కే ఫరూక్ భాషా పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో తమపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ ఎంపీ రఘురామ, ఆయన కుమారుడు భరత్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను న్యాయస్థానం తోసిపుచ్చింది.

## నిలకడగా లాలూ యాదవ్ ఆరోగ్యం



(మొదటి పేజీ తరువాయి) పేర్కొన్నారు. ప్రస్తుతం లాలూ ప్రసాద్ యాదవ్ ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. లాలూ ప్రసాద్ యాదవ్‌ను పాట్నా నుంచి ఢిల్లీలోని ఎయిమ్స్‌కు బుధవారం సాయంత్రం తరలించిన సంగతి తెలిసిందే. గత వారం లాలూ తన ఇంట్లోనే మెట్లు ఎక్కుతుండగా జారి పడ్డారు. దీంతో ఆయనను హుటాహుటిన చికిత్స నిమిత్తం పాట్నాలోని పారాస్ ఆస్పత్రికి తరలించారు. లాలూ భుజం, వెన్నెముకకు తీవ్ర గాయమైనట్లు డాక్టర్లు నిర్ధారించారు. మెరుగైన వైద్యం కోసం ఢిల్లీ ఎయిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

# వంటగ్యాస్ ధరలు తగ్గించకపోతే మరోపోరాటం



కేంద్రం తీరుతో సామాన్యులకు తిప్పలు ● తెలంగాణ చౌరస్తాలో ఆందోళనలో మంత్రి శ్రీనివాసగౌడ్

**మహబూబ్‌నగర్, జూలై 8 (సమ సమాజం):** ప్రపంచంలో ఎక్కడలేని విధంగా వంట గ్యాస్ ధరలు మన దేశంలోనే ఆకాశాన్నంటాయని మంత్రి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. వంట గ్యాస్ ధరలు తగ్గించకపోతే మరో పోరాటం తప్పదని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ ఎనిమిదేండ్లలో వంట గ్యాస్ ధరలు నాలుగు రెట్లు పెంచి పేదల నడ్డి విరిచారని మండిపడ్డారు. వంట గ్యాస్ ధరల పెంపునకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టాలని.. టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు మహబూబ్ నగర్ తెలంగాణ చౌరస్తాలో నిర్వహించిన ధర్నాలో మంత్రి శ్రీనివాస్ గౌడ్ పాల్గొని ప్రసంగించారు. ఈ ఎనిమిదేండ్లలో గ్యాస్ ధరలు దాదాపు నాలుగు రెట్లు పెంచారని తెలిపారు. 2014లో రూ.450 ఉండగా ఇప్పుడు రూ. 1100 కు పైగా దాటిందని గుర్తు చేశారు. సబ్సిడీగా ఇస్తున్న రూ.240ను కూడా దశలవారీగా ఎత్తేసి పేదలపై ఊహించని భారం మోపారని మంత్రి మండిపడ్డారు. కూలీలు, చిరుద్యోగులు తాము సంపాదించిన దాంట్లో కనీసం 10 శాతానికి పైగా వంట గ్యాస్, పెట్రోల్‌కే ఖర్చు చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. కేంద్రం ప్రజా వ్యతిరేక పాలనపై రాష్ట్రాలు ప్రశ్నిస్తే, బెదిరింపులకు పాల్పడుతూ ఈడీ ద్వారా వేధింపులకు గురి చేస్తూ నోరెత్తకుండా చేసే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి శ్రీనివాస్ గౌడ్ ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు కొరమోని నరసింహులు, బస్వరాజు గౌడ్ లక్ష్మి, మూడా చైర్మన్ గంజి వెంకన్న ముదిరాజ్, డిసిసిబి వైస్ చైర్మన్, కొరమోని వెంకటయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ రెహమాన్, మత్స్య సహకార సంఘం చైర్మన్ సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేశ్, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు గోపాల్ యాదవ్, జడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, జేపీఎన్సీ చైర్మన్ రవికుమార్, పార్టీ నాయకులు వినోద్, శివరాజు తదితరులతో పెద్ద ఎత్తున మహిళలు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## హీరో చియాన్ విక్రమ్ గుండెపోటు

(మొదటి పేజీ తరువాయి)ఇలా జరగడంతో ఫ్యాన్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా తమిళనాట ఉన్న స్టార్ హీరోల్లో చియాన్ విక్రమ్ కూడా ఒకరు. భాషతో సంబంధం లేకుండా విక్రమ్ తమిళం, తెలుగు, హిందీలో సినిమాలు చేస్తూ దేశవ్యాప్తంగా ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నారు. అటు తెలుగులోనూ విక్రమ్‌కు మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. విక్రమ్ ఆరోగ్యంపై వచ్చిన వదంతులను ఆయన సన్నిహిత వర్గాలు మాత్రం కొట్టిపారేశాయి. ఆయన ఆరోగ్యంగానే ఉన్నారని, అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరమేమి లేదని తెలిపారు. సోమవారం కోబ్రా మూవీ ఆడియో ఫంక్షన్‌కి విక్రమ్ హాజరయ్యారని, కొంచెం నీరసంగా ఉండటంతో మంగళవారం ఆయన ఆస్పత్రిలో చేరారని తెలిపారు. విక్రమ్‌ని రెండు రోజుల పాటు ఐసీయూలో ఉంచి చికిత్స అందించారని, ఈ రోజు ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారని తెలిపారు.

# బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం



(మొదటి పేజీ తరువాయి) ఎత్తులో కొనసాగుతూ నైరుతి వైపునకు ఒంగి ఉంది. ఇంకా మహారాష్ట్ర నుంచి కేరళ వరకు తీర ద్రోణి, ఉత్తర కోస్తాలో శ్రీకాకుళం, దక్షిణ ఒడిశాపై నుంచి తూర్పు, పడమర ద్రోణి వేర్వేరుగా విస్తరించాయి. అలాగే గుజరాత్ నుంచి ఒడిశాలోని గోపాల్‌పూర్ మీదుగా బంగాళాఖాతం వరకు రుతుపవనద్రోణి కొనసాగుతుంది. వీటన్నింటి ప్రభావంతో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నందున గురువారం కోస్తాలో అనేకచోట్ల, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తాలో విస్తారంగా, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని విశాఖ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. శ్రీకాకుళం నుంచి తూర్పుగోదావరి జిల్లా వరకు భారీ నుంచి అతి భారీవర్షాలు, పశ్చిమ గోదావరి జిల్లాలో భారీవర్షాలు కురుస్తాయని చెప్పారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ మండలం ఉల్వనూరు లో భారీ వర్షం కురిసింది. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గాలేకపోవడంతో వరదనీరు ఇళ్లలోకి చేరుతోంది. వరదతో పాటు విష సర్పాలు కూడా వస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షానికే వరద ఇండ్లలోకి చేరుతుందని చెబుతున్నారు. రాత్రి సమయంలో వాన పడితే కంటిమీద కునుకు ఉండదని తెలిపారు. ప్రతి ఏటా వానాకాలంలో ఇదే పరిస్థితి అని...చిన్న పిల్లలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని కోరుతున్నారు.

## బీజేపీ, ఆర్ఎస్ఎస్, భజరంగ్ దళ్, వీహెచ్ పీలకు హైదరాబాద్ సీపీ వార్నింగ్



**హైదరాబాద్, జూలై 8 (సమ సమాజం):** చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవాలని ఎవరైనా ప్రయత్నిస్తే తీవ్ర చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ సిటీ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ హెచ్చరించారు. బక్రీద్ సందర్భంగా పశువులను తీసుకెళ్తున్న వాహనాలను వెంబడించడం, వ్యక్తులపై దాడులకు దిగడం చేస్తే చూస్తూ ఊరుకోబోమని ఆయన అన్నారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు నోటీసులు

**ముంబై, జూలై 8 (సమ సమాజం):** మహారాష్ట్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ వేసిన ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై హైకమాండ్ కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది. అసెంబ్లీలో జరిగిన బల పరీక్షకు ఆలస్యంగా వచ్చిన మరో 11 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసింది. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని ముంబయి కాంగ్రెస్ అధ్యక్షుడు భాయ్ జగ్తాప్ హెచ్చరించారు. తాను ఇవాళ శాసనమండలి సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశాను. తనతోపాటు చంద్రకాంత్ హండోరే కూడా గెలిస్తే చాలా సంతోషించేవాడినని చెప్పారు.

# బిజెపితో కలసి వెన్నుపోటు

## దమ్ముంటే మధ్యంతర ఎన్నికలకు వెళ్లాలి

## ఏక్‌నాథ్ షిండేకు శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే సవాల్



**ముంబై, జూలై 8 (సమ సమాజం):** మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండేకు శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే సవాల్ విసిరారు. వెంటనే మధ్యంతర ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. షిండే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి మీడియాతో మాట్లాడిన ఉద్ధవ్.. ఎలక్షన్ పెడితే జనం ఎవరివైపు ఉన్నారో తేలిపోతుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో రెబల్ ఎమ్మెల్యేలను శివసేన పార్టీ గుర్తుపై పోటీ చేయనిచ్చే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. మధ్యంతర ఎన్నికలు నిర్వహిస్తే ప్రజలే తీర్పు చెబుతారని ఉద్ధవ్ అభిప్రాయ పడ్డారు. ఒకవేళ తను తప్పు చేసి ఉంటే ప్రజలే తనను ఇంటికి సాగనంపుతారని అన్నారు. వెన్నుపోటు పొడిచి అధికారం చేపట్టాలనుకునుకుంటే రెండున్నరేళ్ల క్రితమే చేసి ఉండాల్సిందని అన్నారు. శివసేన పార్టీ గుర్తును ఎవరూ తన నుంచి తీసుకోలేరన్న ఉద్ధవ్ జనం కేవలం పార్టీ సింబల్ చూసి ఓటేయరని, అది ఎవరి దగ్గరుందన్న విషయాన్ని కూడా పరిగణలోకి తీసుకుంటారని అన్నారు. శివసేన రెబల్ ఎమ్మెల్యేలపైనా ఉద్ధవ్ ఫైర్ అయ్యారు. బీజేపీ నేతలు తనతో పాటు తన కుటుంబాన్ని టార్గెట్ చేసినా ఎవరూ నోరు మెదపలేదని మండిపడ్డారు. బీజేపీ వారితో కలిసి సొంత పార్టీనే వెన్నుపోటు పొడిచారని విమర్శించారు.

## వైభవంగా బోనాల ఉత్సవాల నిర్వహణ

### మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

**హైదరాబాద్, జూలై 8 (సమ సమాజం):** ఎంతో చరిత్ర కలిగిన మహంకాళి అమ్మవారి ఉత్సవాలకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. రెండేళ్లతరవాత జరుగుతున్న ఉత్సవాలకు ఏర్పట్లు జరిగాయని అన్నారు. ఈ నెల 17న జరిగే సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల నిర్వహణపై శుక్రవారం మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... హైదరాబాద్, సికింద్రాబాద్‌కే పరిమితమైన బోనాలు నేడు విశ్వవ్యాప్తం అయ్యాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ఎంతో గొప్పగా బోనాల ఉత్సవాల నిర్వహణ జరుగుతోందని తెలిపారు. ఉత్సవాల నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.15 కోట్లు మంజూరు చేసిందన్నారు. బోనాల ఉత్సవాలకు గతంలో కంటే అత్యధిక సంఖ్యలో భక్తులు రానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, మహమూద్ అలీ పాల్గొన్నారు. 17న మహంకాళీ అమ్మవారి బోనాలు జరుగనుండగా... 18న రంగం, అంబారీపై అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం జరుగనుంది.

# రైతుల సంక్షేమాన్ని విస్మరించిన కెసిఆర్

### కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి కైలాష్‌చౌదరి



**నల్గొండ, జూలై 8 (సమ సమాజం):** రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజనను రాష్ట్రం అమలు చేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి కైలాష్‌చౌదరి దుయ్యబట్టారు. శుక్రవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం ఉచిత హామీలు ఇచ్చి రైతులను మోసం చేస్తుందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించిందని తప్పుబట్టారు. ప్రధాని నరేంద్రమోదీ రైతులకు తక్కువ ధరకే ఎరువులను అందించాలనే ఉద్దేశంతో ప్రత్యేక బ్జడెట్ ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అదేవిధంగా కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతులకు రూ.6 వేలు పెట్టుబడి సాయంగా ఇస్తున్నట్లు కైలాష్ చౌదరి పేర్కొన్నారు.

# ఏం ఘనకార్యం సాధించారని ప్లీనరీ



పోలీసులు లేకుండా జనంలో తిరగగలవా

మద్యంలో విష పదార్థాలపై ఎందుకు సమాధానం లేదు

నగరి బాదుడే బాదుడు సభలో చంద్రబాబు విమర్శలు

**తిరుపతి, జూలై 8 (సమ సమాజం):** ఏం సాధించారని ప్లీనరీ అంటూ చంద్రబాబు ప్రశ్నల వర్షం కురిపించారు. ఏం సాధించావని ప్లీనరీ పెట్టుకున్నావు. పోలీసులను పెట్టుకుని తిరగడం కాదు. నాడు ముద్దులు పెట్టినప్పుడు ఎలా తిరిగావో ఇప్పుడు అలా తిరుగు అంటూ సవాల్ చేశారు. జనాగ్రహం ఏమిటో అప్పుడు నీకు తెలుస్తుందని అన్నారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు నగరిలో నిర్వహించిన 'బాదుడే బాదుడే' కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఎం జగన్‌ను తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ తీరును తూర్పార బట్టారు. వైసీపీ సర్కారుపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఏపీలో దొరుకుతున్న మద్యంలో విషపదార్థాలు ఉన్నట్లు ల్యాబ్‌ల్లో బయటపడింది. దానిపై సమాధానం చెప్పరు. అరాచక పాలనకు చరమగీతం పాడాలంటే నేను ఒక్కడినే పోరాడితే సరిపోదు. మీరంతా అండగా నిలబడాలి.. ఇంటికొకరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చేనేత కార్మికులకు అండగా ఉన్నాను. ఇకపై కూడా ఉంటా. టెక్స్‌టైల్స్ పరిశ్రమలకు అండగా నిలుస్తా. అధికారంలోకి రాగానే చేనేతలకు 500 యూనిట్ల ఉచిత కరెంట్ ఇస్తాం. నగరిలో కాలుష్య నివారణకు నానో టెక్నాలజీ తెస్తానని చెప్పారు. తిరుమలలో ఎన్టీఆర్ అన్నదానం కార్యక్రమం మొదలు పెట్టారు. ఆ స్ఫూర్తితోనే అన్న క్యాంటీన్లు పెట్టా. ఆకలి తీర్చే అన్నక్యాంటీన్లు రద్దు చేస్తారా? ఇదేనా పేదలపై ఉన్న ప్రేమ. నేను తెచ్చానన్న కోపంతో అనేక ప్రాజెక్టులు ఆపారు. డ్రైనేజీ కాలువలు కూడా తవ్వలేని వ్యక్తి 3 రాజధానులు కడతాడట. డ్యాములు నిర్మించగలడా?' అని ప్రశ్నించారు. బాబాయ్‌ను చంపాడు.. అమ్మను పార్టీ నుంచి తరిమేశాడు.రాజకీయాల కోసం అందర్నీ వాడుకుని వదిలేసే రకం జగన్‌ది. బాబాయ్‌ను చంపాడు. అమ్మను పార్టీ నుంచి తరిమేశాడు. పార్టీలో ఎన్నికలు లేకుండా శాశ్వత అధ్యక్షుడిగా ప్రకటించుకున్నాడు. జగన్ నొక్కేవన్నీ ఉత్తుత్తి బటన్‌లే. ఎంతమందికి పెన్షన్లు ఇచ్చారో ఆన్‌లైన్‌లో పెట్టగలరా అని ప్రశ్నించారు. వైసీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నష్టాల్లో ఉన్న సాక్షి.. ఇప్పుడు లాభాల బాట పట్టింది. భారతి సిమెంట్ కోసం అన్ని సిమెంట్ ధరలు పెంచేలా చేశాడని అన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు తీసేస్తా సీఎం జగన్ 50 మందికి కుర్చీలు లేని ఆఫీసులు ఇచ్చి బీసీలకు ఏదేదో చేసినట్లు చెబుతున్నారు. బీసీలకు రూపాయి రుణం ఇవ్వగలరా? సీఎం రిలీఫ్ వందల కోట్లు ఇచ్చా.. ఇప్పుడు సీఎంఆర్ఎఫ్ ఏమైంది? జగన్ పాలన.. డ్రైవింగ్ రాని వ్యక్తి బండి నడిపినట్లుందని చంద్రబాబు విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గౌరవాధ్యక్షురాలిగా వైఎస్ విజయమ్మ రాజీనామాపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు స్పందించారు. మొన్న చెల్లి షర్మిల వెళ్లిపోయింది.. ఇప్పుడు తల్లి వైఎస్ విజయమ్మ వెళ్లిపోయిందని వ్యాఖ్యానించారు. సీఎం వైఎస్ జగన్ అందరినీ వాడుకుంటాడు అని ఎద్దేవా చేశారు.చీకటి పాలన వద్దూ చీకటి జీవోలు వద్దని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

## పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని

## రెండవ రోజు ధర్నా నిర్వహించిన టీఆర్ఎస్ ఎమ్మెల్యే



**మెదక్, జూలై 8 (సమ సమాజం):** తెలంగాణలో ఏ వర్గానికి న్యాయం చేయని పరిస్థితిలో బిజెపి ప్రభుత్వం ఉందని మెదక్ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నాడు తెరాస ధర్నా చేపట్టారు, అనంతరం వంటావార్పు, గ్యాస్ సిలిండర్లు మధ్యలో పెట్టి మెదక్ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. 2014 లో 410 రూపాయలు ఉన్న గ్యాస్ సిలిండర్ రేటు ఈరోజు 1105 రూపాయలకు పెరిగిందని ఇదేనా డబుల్ ఇంజన్ అంటే అని ధ్వజమెత్తారు. పెట్రోల్ డీజిల్ రేట్ తో పాటు బంగారం రేటు కూడా పెరిగిందని ఒక్క హామీ కూడా నిలబెట్టుకోలేదని అన్నారు. మోడీ ప్రభుత్వం దేశానికి చేసింది ఏమీ లేదన్నారు. నోట్లు రద్దుచేసి మోది . పాపం మూట కట్టుకున్నారని నల్లధనం తీసుకొస్తామని ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని ఆరోపించారు. హైదరాబాద్ కు మోడీ వచ్చి ఏం ఉద్ధరించాడని ప్రశ్నించారు మీ పార్టీ కార్యక్రమాలు చేసుకుని వెళ్లిపోక మళ్ళీ గ్యాస్ సిలిండర్ ధర పెంచారు అని ఇదేనా మోడీ పరిపాలన అని తీవ్రస్థాయిలో విమర్శించారు. మోదీ హైదరాబాదు కు వచ్చి తెలంగాణకు ఏమైనా ఇచ్చావా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలను గౌరవించలేదని, తెలంగాణ ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారని అన్నారు. 19 రాష్ట్రాల్లో బీజేపీ పరిపాలన చేస్తుందని గొప్పగా చెప్తున్నారు కదా మరి దేశంలో గ్యాస్ రేట్లను విపరీతంగా పెంచడం వల్ల ఆడబిడ్డలు ఉసురు తగులుతుందన్నారు. 1105 గ్యాస్ సిలిండర్ ధర కట్టే స్థితిలో తెలంగాణ ఆడబిడ్డ లేరని అన్నారు. దేశ ప్రజలందరూ ఆందోళనలో ఉన్నారని ప్రజలు అంత ఆగం అవుతున్నారు అని అన్నారు. యాసంగిలో పండిన పంట కోనని పరిస్థితిలో కేంద్ర ప్రభుత్వం ఉందని అన్నారు అలాగే తెలంగాణ ప్రభుత్వానికి రావలసిన జీఎస్టీ ఇప్పటివరకు ఇవ్వలేదు అన్నారు. బిజెపి పరిపాలిస్తున్న 19 రాష్ట్రాల్లో దేశంలో ఎక్కడ కూడా తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ఎక్కడా కూడా లేవన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ మంచిగా పరిపాలిస్తున్నాడని కుట్రకొద్దీ మోడీ హైదరాబాద్ కు వచ్చాడని హైదరాబాద్ ను దోచుకోవడానికి అమ్ముకోవడానికి చూస్తున్నారని అన్నారు.

## జయహో ప్రచారం ప్రారంభించిన ఈటెల



**న్యూఢిల్లీ, జూలై 8 (సమ సమాజం):** మానవ సమాజం త్యాగాల పునాదులపై ఏర్పడిందని, త్యాగం లేకపోతే వ్యర్థమని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. ఐ స్టాండ్ ఫర్ వారియర్స్ కార్యక్రమంలో ఈటల పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయహో ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎందరో పుడతారు, చస్తారు.. కానీ కొందరే గుర్తుంటారని పేర్కొన్నారు. త్యాగధనులను గుర్తు చేసుకోవాలని సూచించారు. ఆగస్ట్ 15న మధ్యాహ్నం 12 గంటలకు దేశ ప్రజలంతా లేచి నిలబడి, జాతీయ గీతం అలాపించాలని ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు.

## సూర్యాపేటలో భారీ వర్షం

### ఆత్మకూరు మండలంలో 19సెంటీమీటర్లు నమోదు

**సూర్యాపేట, జూలై 8 (సమ సమాజం):** సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్)మండలంలో 19 సెంటీమీటర్ల వర్షం కురిసింది. అలాగే తుంగతుర్తిలో 14 సెంటీమీటర్లు, నడిగూడెంలో 13, మద్దిరాలలో 11, నాగారంలో 9 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదు అయింది. నకిరేకల్ లో 9 సెం.మీ, నల్గొండలో 7, కేతేపల్లిలో 7, శాలిగౌరారంలో 7, తిప్పర్తిలో 6 సెంటీమీటర్ల చొప్పున వర్షం పాతం నమోదు అయింది. అలాగే యాదాద్రి జిల్లా అడ్డగుడూర్ మండలంలోని పలు గ్రామాల్లో రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడుతోంది. ధర్మారం చెరువు అలుగు పోస్తుండటంతో ధర్మారం - లక్ష్మీదేవి కాల్వ గ్రామాల మధ్య నిలిచిపోయిన రాకపోకలు నిలిచిపోయాయి.

## అత్యవసర సేవలకు జిల్లా పోలీసు సిద్ధంగా ఉండాలి

### రోహిణి ప్రియదర్శిని ఐ.పి.ఎస్



**మెదక్, జూలై 8 (సమ సమాజం):** మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్.పి రోహిణి ప్రియదర్శిని ఐ.పి.ఎస్ మాట్లాడుతూ... జిల్లాలో నిర్విరామంగా కురుస్తున్న ముసురు వానలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలో ముసురు వానలు కురుస్తున్నదంవల్ల మట్టి ఇండ్లలో, పురాతన ఇళ్లలో ఉన్న ప్రజల సమాచారం తెలుసుకుని ఎవరైనా ప్రమాదంలో ఉంటే సంబంధిత అధికారుల సమన్వయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, వర్షాలు పడుతున్నప్పుడు కరెంటు ట్రాన్స్ఫార్మర్, స్తంభాలను ముట్టుకోకుండా వాటికి చిన్న పిల్లలను దూరంగా ఉంచాలని అలాగే పాడుపడ్డ ఇండ్లలో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రజలకు ఏ విధమైన సేవలు అందించడానికైనా జిల్లా సిబ్బంది సిద్ధంగా ఉండాలని సిబ్బందికి పలు సూచనలు చేయడం జరిగింది. భారీ వర్షాలు పడే అవకాశం ఉండే సమయాల్లో ముంపు ప్రాంతాల్లో ఉండే ప్రజలు అలాగే పూరిల్లు, గుడిసెలు, పాత ఇల్లు, మట్టి ఇల్లు, పురాతన కట్టడాలు, శిదిలావస్థలో ఉన్న ఇళ్ళలో ఉండే వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. సిబ్బందిని ఉద్దేశ్యించి మాట్లాడుతూ... తమ తమ పోలీస్ స్టేషన్ ల పరిదిలలో డ్యామ్ లు, చెరువులు, కుంటలు, అలుగులు పారే ప్రదేశాలను గుర్తించి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అక్కడి ప్రాంత ప్రజలకు వరద ప్రమాదాలపై అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే వర్షాల కారణంగా విద్యుత్ స్థంబాలకు ఎర్తింగ్ ద్వారా విధ్యుత్ సరఫరా అయ్యి కరెంట్ షాక్ తగిలే అవకాశం వున్నందున జిల్లా ప్రజలు పిల్లలు ఎవరు కూడా విద్యుత్ స్థంబాలను కానీ విద్యుత్ పరికరాలను ముట్టుకోకుండా జాగ్రత్తగా వుండాలని, ముఖ్యంగా వ్యవసాయ పనుల నిమిత్తం పంట పొలాలకు వెళ్ళే రైతులు బోర్ మోటారు వేసే సమయాల్లో జాగ్రత్తగా ఉండాలని అన్నారు. విపత్కర పరిస్థితులు ఎదురైతే వెంటనే డయల్ 100 కానీ పోలీస్ స్టేషన్ కి కానీ, పోలీస్ కంట్రోల్ రూమ్ 08452-223533, 7330671900 కి సమాచారం ఇవ్వాలని అన్నారు.

## నెల వారి నేర సమీక్షా సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని ఐపీఎస్



**మెదక్, జూలై 8 (సమ సమాజం):** మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా యెస్.పి రోహిణి ప్రియదర్శిని ఐ.పి.ఎస్ జిల్లా సిబ్బందితో నెల వారి నేర సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కేసులు పెండింగ్ లో ఉండుటకు గల ముఖ్య కారణాలను తెలుసుకొని ప్రస్తుతము అట్టి కేసుల యొక్క పరిస్థితులను తెలుసుకొని చాలా కాలము నుండి పెండింగ్ లో ఉన్నటువంటి కేసులను సంబంధిత అధికారులు పూర్తి చేయాలని, పెండింగ్ ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులకు సంబంధించిన డాక్యుమెంట్స్ రిపోర్ట్స్, మెడికల్ సర్టిఫికెట్ త్వరగా తెప్పించి ప్రతిరోజు కేసులను టార్గెట్గా పెట్టుకుని ప్రతి పోలీస్ స్టేషన్లలో (యు.ఐ) కేసులు తగ్గించడానికి ప్రతి అధికారి ఛాలెంజ్ గా తీసుకొని కేసులు చేదించాలని సూచించారు. అలాగే పోలీస్ స్టేషన్ కు వివిధ రకాల అభ్యర్థనలు/ ఫిర్యాదులు/ సమాచారం/ సహాయం కోసం వచ్చే ప్రతి ఒక్కరిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించి తగు సేవలు అందించడంలో రిసెప్షన్ అధికారి యొక్క పాత్ర కీలకమైనదని, ప్రజలందరికీ పోలీస్ వ్యవస్థ పై నమ్మకం విశ్వాసం కల్పించడంలో రిసెప్షన్ అధికారి ముఖ్య పాత్ర వహిస్తారని తెలిపారు. రిసెప్షన్ అధికారి బాధితులతో మర్యాదపూర్వకంగా స్నేహపూర్వకంగా ప్రవర్తిస్తూ వారి పట్ల సానుభూతితో వ్యవహరించాలని తెలిపారు. వ్రాత పూర్వక ఫిర్యాదు విషయంలో ఫిర్యాదును సూక్ష్మంగా చదివి ఎస్సై దగ్గరికి గాని తన పై అధికారులకు గాని లేదా ఇతర వర్టికల్ అధికారులకు గాని తెలియజేసి తగు చర్యలు తీసుకునే విధంగా చూడవలెనని, ఫిర్యాదులను ఎస్ హెచ్ వో లేదా ఇంచార్జి అధికారులతో కలిపించి ఆ వివరములను మరియు తీసుకున్న చర్యల వివరాలను పిటిషన్ మేనేజ్మెంట్ అప్లికేషన్ లో నమోదు చేయాలని తెలిపారు. అదే విధంగా మహిళాలు, పిల్లల రక్షణ విషయములో ప్రత్యేక దృష్టి సారించాలని, పోలీస్ అధికారులు మహిళా రక్షణకు అన్ని చర్యలు చేపట్టాలని తెలిపారు, పోక్సో కేసులలో, ఎస్.సి., ఎస్.టి. కేసులల్లో పూర్తి సాక్ష్యాలతో దర్యాప్తును చేసి నేరస్తులకు శిక్షలు పడేవిధంగా చూడాలని, చట్టముపై సమాజములో అవగాహన కల్పించాలని, ప్రతి యూనిట్ అధికారులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ, ప్రత్యేక ప్రణాళికతో పెండింగ్ కేసులను తగ్గించాలని బ్ల్యూ కొల్ట్స్, పాట్రో మొబైల్ అనుక్షణం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆపదలో ఉన్న వారిని ఆదుకోవటం చాలా ముఖ్యం అని అన్నారు. రిసెప్షన్, ఎస్.హెచ్.ఒ, కమ్యూనిటి పోలిసింగ్ ఇలా పోలీసు స్టేషన్ కి సంబందించిన అన్ని విభాగాల ఫంక్షనల్ వర్టికల్స్ గురించి వారి యొక్క పనితీరు గురించి అడిగి తెలుసుకొని స్టేషన్లోని వివిధ వర్టికల్స్ లో సిబ్బంది పోటీతత్వం తో పనిచేసి మెరుగైన అభివృద్ధి సాధించాలని తెలిపారు. నేర విచారణ అధికారి కేసులలో శిక్షలు పడే విధంగా ఇన్వెస్టిగేషన్ చేయాలని, కోర్టులో ట్రయిల్ నడిచే సమయంలో పోలీస్ అధికారులు సాక్షులను మోటివేట్ చేయాలని సూచించారు. అలాగే సమన్స్, వారంట్స్ ఎగ్సిక్యూటివ్ చేయాలని, క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్ కేసుల్లో త్వరగా ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని పోలీస్ స్టేషన్ కి వచ్చే ప్రతి దరఖాస్తును ప్రాపర్ గా ఎంక్వైరీ చేసి, ఎంక్వైరీ రిపోర్టును ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రతి దరఖాస్తులో పారదర్శకంగా ఎంక్వైరీ చేసి అట్టి రిపోర్టును ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని సూచించారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ కేసుల విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, కొత్త కేసులతో పాటు చాలా కాలంగా పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించడం ద్వారా కేసుల సంఖ్య తగ్గించే దిశగా అన్నిస్థాయిల అధికారుల పని చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా, తూప్రాన్ డి.ఎస్.పి. యాదగిరి రెడ్డి, మెదక్ డి.ఎస్.పి సైదులు, డి.సి.ఆర్.బి. డి.ఎస్.పి .నారాయణ రెడ్డి, ఐ.టి.కోర్ ఎస్.ఐ.సందీప్ రెడ్డి జిల్లా సి.ఐ.లు, యెస్.ఐ లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఈశ్రం కార్డ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**దోమ, జూలై 8 (సమ సమాజం):** జన్ సహాస్ స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో లో నేడు మండల పరిధి లోని మల్లేపల్లి గ్రామంలో ఈశ్రం, అయూష్మాన్ భారత్ కార్డ్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జన్ సహాస్ సభ్యులు మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే 2 లక్షల ఇన్సూరెన్స్ అట్లాగే ప్రమాదవశాత్తు అంగవైకల్యం ఏర్పడితే 1 లక్ష ఇన్సూరెన్స్ సౌకర్యం ఉంటాయని భవిష్యత్ లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టే ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు కొరకు కూడా ఈశ్రమ్ కార్డ్ అడగబోతున్నది కాబట్టి అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులందరూ కూడా ఖచ్చితంగా ఈశ్రం కార్డ్ నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జన్ సహాస్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు అసద్, రవీంద్ర,వంశీ కృష్ణ మరియు మల్లె పల్లీ గ్రామస్తులు, అసంఘటిత రంగ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ హాస్టళ్ళలో ఖాళీల భర్తీకి కృషి

### సర్పంచ్ కె రాజిరెడ్డి



**దోమ, జూలై 8 (సమ సమాజం):** దోమ మండల కేంద్రంలోని బీసీ ఎస్సి సంక్షేమ హాస్టళ్ళలో ఖాళిల భర్తిల చర్యల కోసం దోమ మండల సర్పంచుల సంఘము అధ్యక్షులు కె రాజిరెడ్డి శుక్రవారం హాస్టల్ వార్డెన్ ప్రధానోపాధ్యాయులు పురాంధసులుతో మాట్లాడారు ఎస్సి హాస్టల్ లో 90 కి పైగా హాస్టల్ విద్యార్థులు ఉండగా బీసీ హాస్టల్ లో 20 మంది విద్యార్థులు ఉండడం తో ఎస్సి హాస్టల్ లో పెండింగ్ లో ఉన్న 8 దరఖాస్తులను బీసీ హాస్టల్ కు పంపాలని సర్పంచ్ రాజిరెడ్డి ఎస్సి హాస్టల్ వార్డెను కోరారు దోమ జిల్లా పరిషత్ పాఠశాలలో 6 నుండి పదవ తరగతి చదవడానికి వచ్చిన పక్క గ్రామాల విద్యార్థులను బీసీ హాస్టల్లో చేరేలా చూడాలని హెచ్ఎం ను కోరారు.జిల్లా పరిషత్ పాఠశాలలో ఆరు నుండి పది తరగతుల విద్యార్థుల వివరాలు సేకరించి చుట్టూ పక్కల గ్రామాల్లో కి వెళ్లి విద్యార్థుల పేరెంట్స్ కు కూడా హాస్టల్లో విద్యార్థులకు అందిస్తున్న మెనూ ప్రత్యేక తరగతుల గురుంచి వివరించి అడ్మిషన్ పొందాలని ఆయా గ్రామాల సర్పంచ్ ఎంపీటీసీ లు ఇతర ప్రజాప్రతినిధులు పెద్దలు యువకులను కలవాలని సర్పంచ్ రాజిరెడ్డి వార్డెన్ శ్రీనివాస్ కు సూచించారు.

## గోదన్ నాయక్ మృతి బాధాకరం

### పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి



**పరిగి, జూలై 8 (సమ సమాజం):** శుక్రవారం పరిగి మండల పరిధిలోని జీడిగడ్డ తండాకు చెందిన తెరాస సీనియర్ నాయకులు గోధన్ నాయక్ ఇటివలే మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరిగి ఎమ్మెల్యే మహేష్ రెడ్డి పరామర్శించి, మనోధైర్యం నింపారు. గోధన్ మృతి బాధాకరం అని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని విధాలుగా వారి కుటుంబాన్ని ఆదుకుంటామని, పిల్లల చదువులకు అయ్యే ఖర్చు నెనే భరిస్తా అని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.అనంతరం తక్షణ అవసరాల నిమిత్తం వారికి 20,000/- వేల రూపాయలు అందించారు. ఈ కార్యక్రమంలో పరిగి మండల ప్రజాప్రతినిధులు, తండా నాయకులు రంగంపల్లి గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అనాధ పిల్లలకు ఎల్లవేళలా అండగా ఉంటాం

### మెదక్ జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని.



**మెదక్, జూలై 8 (సమ సమాజం):** మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని పెద్ద శంకరంపేట పోలీసు స్టేషన్ పరిది శివాయపల్లి గ్రామ శివారులో జరిగిన మహిళా హత్య సంఘటనలో తమ తల్లిని కొల్పోయిన పిల్లలు సంతోష, శ్రావణిలకు వారి బాగోగుల నిమిత్తం కోసం వారి పేరు పైన ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయల చొప్పున చేసిన ఫిక్సిడ్ డిపాజిట్ పత్రాలను అందజేయడం జరిగింది. అలాగే వారి ఉన్నత చదువుల కోసం కూడా కృషి చేస్తున్నట్లు తెలిపారు. వారికి జిల్లా పోలీస్ శాఖా అన్నీ వేళలా అండగా ఉంటుందని ఏదైనా ఇబ్బంది ఉంటే తమని సంప్రదించవచ్చు అని ఈ సంధర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ డిఎస్పీ, సైదులు, అల్లాదుర్గ్ సి.ఐ.జార్జ్, పెద్ద శంకరంపేట ఎస్.ఐ.బాలరాజు పాల్గొన్నారు.

## ఏడుపాయల అభివృద్ధికి కృషి చేస్తా

### ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి



**మెదక్, జూలై 8 (సమ సమాజం):** మెదక్ జిల్లాలోని పవిత్ర క్షేత్రం ఏడుపాయల వన దుర్గభవాని ఆమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించిన, సీఎం కేసీఆర్ రాజకీయ కార్యదర్శి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, నూతనంగా ఎన్నికైన ఏడుపాయల దేవస్థాన కమిటీ దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తూ ఇక్కడికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు ఏడుపాయలకు చేరుకున్న ఎమ్మెల్సీ కి ఆలయ ఈవో, పూజారులు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏడుపాయల చైర్మన్ బాలాగౌడ్, ఈవో శ్రీనివాస్ లు ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి కి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం శేరి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిఎం కెసి ఆర్ దేవాలయాల అభివృద్ధికి గాను ఎంత గానూ కృషి చేస్తున్నారని అన్నారు. ఏడుపాయల జాతరను ఘనంగా నిర్వహించేందుకు గాను నిధులు మంజూరు చేస్తూ ఏడుపాయలలో ఎన్నో వసతులు కల్పించడం ద్వారా ఎందరో భక్తులు దుర్గమాత ను దర్శించుకుంటున్నారని అన్నారు. ఏడుపాయలకు రోడ్డు నిర్మాణం తో భక్తులకు తక్కువ దూరం కావడంతో పాటు రవాణా సౌకర్యం మెరుగుపడిందన్నారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్ బాలాగౌడ్, డైరెక్టర్ లను ఎమ్మెల్సీ శేరి శుభాష్ రెడ్డి శాలవాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి, ఆలయ కమిటీ ఛైర్మన్ బాలాగౌడ్, డైరెక్టర్లు మోహన్ రామ మునోహర్ యాణం యాధాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గోవధ జరగకుండా చూడండి

### డిజిపికి విహెచ్‌పి నేతల వినతి

**హైదరాబాద్, జూలై 8 (సమ సమాజం):** బక్రీద్ సందర్భంగా గో వధను నిషేధించాలని భజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్ నేతలు డీజీపీ ఎం మహీందర్ రెడ్డిని కోరారు. బక్రీద్ పండుగ సందర్భంగా హైదరాబాద్‌కు వేలాది గోవులను తరలించే అవకాశం ఉన్నందున, ప్రతి చెక్‌పోస్టు వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గోవుల అక్రమ రవాణా అరికట్టి, 1977 గో సంరక్షణ చట్టాన్ని అమలు చేయాలని కోరడంతో డీజీపీ సానుకూలంగా స్పందించారని వీహెచ్‌పీ నాయకులు తెలిపారు. గో వధను జరగకుండా చూడాలని కోరారు.




# చలన చిత్రం

## ఆగస్ట్ 12న మాచర్ల నియోజకవర్గం




నటుడు నితిన్ 'రంగ్‌దే' విజయం సాధించగా 'చెక్' ప్లాప్‌గా మిగిలింది. ఇక 'మ్యాస్ట్రో'గా ఓటీటీలో విడుదలై మంచి వ్యూవర్ షిప్‌ను సాధించింది. ప్రస్తుతం నితిన్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'మాచర్ల నియోజకవర్గం'. రొటీన్‌కు భిన్నంగా నితిన్ ఈ సారి పొలిటికల్ థ్రిల్లర్ కథతో రానున్నాడు. ప్రముఖ ఎడిటర్ ఎంఎస్.రాజశేఖర్ రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతూ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. ఇప్పటికే చిత్రం నుంచి విడుదలైన పోస్టర్‌లు, గ్లింప్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఈ చిత్రం ఆగస్టు 12న విడుదల కానుంది. ఈ క్రమంలో మేకర్స్ అప్‌డేట్‌లను షురూ చేసారు. తాజాగా ఈ చిత్రంలోని 'రా రా రెడ్డి' సాంగ్ ప్రోమోను విడుదల చేశారు. 'రా రా రెడ్డి' అంటూ సాగే ప్రోమో ఆకట్టుకుంటుంది. నితిన్, అంజలి మాస్ బీట్ స్టెప్స్ అలరిస్తున్నాయి. మహతి స్వర సాగర్ ట్యూన్ ఊపునిస్తుంది. ఈ మాస్ సాంగ్, జాతరలో జరిగే ఫైట్ ముందు వచ్చే పాటలా కనిపిస్తుంది. ఫుల్ సాంగ్ శనివారం సాయంత్రం 5 గంటలకు విడుదల కానుంది. నితిన్ ఈ చిత్రంలో గుంటూరు జిల్లా కలెక్టర్‌గా నటించనున్నాడు. కృతిశెట్టి, క్యాథెరీన్ థెరిస్సా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రంతో నితిన్ మొదటి సారిగా పూర్తి యాక్షన్ సినిమాలో నటించనున్నాడు.

## వరుస సినిమాలతో బిజీగా ఆది

**పూర్తి కావస్తున్న తాజా చిత్రం క్రేజీఫెల్లో చిత్రీకరణ**

హిట్లు, ప్లాపులలో సంబంధంలేకుండా వరుసగా సినిమాలను చేస్తూ ప్రేక్షకులను ఆది సాయికుమార్ అలరిస్తున్నాడు. 'ప్రేమకావాలి' సినిమాతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన ఆది అనతికాలంలోనే మంచి నటుడుగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ప్రస్తుతం ఈయన క్రేజ్ ఎలా ఉన్నా సినిమాలను మాత్రం వరుస పెట్టి ఓకే చేస్తున్నాడు. ఇప్పటికే ఈయన ఆరు సినిమాలను లైన్లో పెట్టాడు. అందులో 'క్రేజీ ఫెల్లో' ఒకటి. సిరికి ఫణికృష్ణ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. చిత్రం నుండి విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు సినిమాపై మంచి బజ్‌ను క్రియేట్ చేశాయి. తాజాగా మేకర్స్ సినిమా విడుదల తేదీని ప్రకటించారు.యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం సెప్టెంబర్ 16న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు మేకర్స్ పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపు కుంటున్న ఈ చిత్రం ఆదికి మంచి బ్రేక్ ఇస్తుందని నమ్ముతున్నాడు. ఆర్‌ఆర్ ధృవన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో ఆదికి జోడీగా దిగంగన సూర్యవంశీ, మిర్నా మీనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కెకె రాధామోహన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫి:సతీష్ ముత్యాల, ఎడిటింగ్:సత్య గిడుటూరి.



## ఓటీటీలోకి ఎంట్రీ ఇవ్వబోతున్న మెగాస్టార్

మెగాస్టార్ చిరంజీవి తన కెరీర్‌లోనే ఓ సంచలన నిర్ణయం తీసుకోనున్నట్టు తాజా సమాచారం. తన స్థాయి స్టార్ డమ్ ఉన్న సమకాలీన హీరోలకు దీటుగా చిరు కొత్త అడుగు వేయడానికి రెడీ అవుతున్నారట. అదే ఓటీటీ ప్లాట్‌ఫామ్. ప్రతీ ఒక్కరూ ఇప్పుడు సినిమాలతో పాటు ఓటీటీలో నటించడంపై ఉత్సాహం చూపిస్తున్నారు. బాలీవుడ్, కోలీవుడ్ లో ఈ సాంప్రదాయం ఇప్పటికే మొదలైంది. తెలుగులో ఇప్పుడిప్పుడే స్టార్ట్ అయింది. ఇటీవల జగపతి బాబు, శ్రీకాంత్, సాయికుమార్ లాంటి కేరక్టర్ నటులతో పాటు సత్యదేవ్ లాంటి యంగ్ హీరోలు సైతం.. వెబ్ సిరీస్‌తో ఓటీటీ ప్రేక్షకుల ముందుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఓటీటీలోకి ఎంటర్ అవుతున్న తొలి సూపర్ స్టార్‌గా చిరంజీవి సరికొత్త రికార్డు నెలకొల్పాల నుకుంటున్నారట. ఈ క్రమంలో చిరు మంచి వెబ్ సిరీస్ కోసం చూస్తున్నారట. ఆల్రెడీ సినియర్ హీరో వెంకటేశ్.. రానా తో కలిసి 'రానానాయుడు' అనే వెబ్ సిరీస్ లో నటిస్తున్న సంగతి తెలిసిందే. నిజానికి చిరంజీవి స్థాయి స్టార్స్ అయిన రజనీకాంత్ మోహన్ లాల్ , మమ్ముట్టి సల్మాన్ ఖాన్ లాంటి సూపర్ స్టార్స్ ఇంకా ఓటీటీవైపు చూడలేదు. అయితే వీరందరి కంటే ముందే ఓటీటీలోకి ప్రవేశించి.. సరికొత్త రికార్డు సొంతం చేసుకోవాలని చిరంజీవి ఎ÷-లాన్‌గా తెలుస్తోంది. ఇండియా వైడ్ గా పాపులారిటీ సొంతం చేసుకున్న రెండు దిగ్గజ ఓటీటీ సంస్థలు ఇప్పటికే చిరును సంప్రదించారని, ఓ భారీ వెబ్ సిరీస్ కోసం చిరును ఒప్పించారని సమాచారం. అయితే వెబ్ సిరీస్ లో నటించడమంటే.. సినిమాల్లో నటించినంత తేలికకాదు. ఆయన్ని పక్కగా ఎస్టాబ్లిష్ చేయగలిగే అదిరిపోయే స్క్రిప్ట్ కావాలి. అలాంటి కథలు చేయడానికి తనకు అభ్యంతరం లేదని చిరు చెప్పారని కూడా తెలుస్తోంది. మరి మెగాస్టార్ మొట్టమొదటి ఓటీటీ జెర్నీ.. ఎప్పుడు షురూ అవుతుందో చూడాలి.

## ఓటీటీలోనూ మేజర్ చిత్రానికి మంచి స్పందన



ముంబై ఉగ్రదాడుల్లో వీరమరణం పొందిన మేజర్ సందీప్ ఉన్ని కృష్ణన్ జీవితం ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'మేజర్'. అడివి శేష్ లీడ్ రోల్ పోషించిన ఈ చిత్రానికి శశి కిరణ్ తిక్క దర్శకత్వం వహించారు. జూన్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా ఘన విజయం సాధించింది. అడివి శేష్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లను రాబట్టిన చిత్రంగా నిలిచింది. తాజాగా ఈ చిత్రం ఓటీటీలోనూ రికార్డులను సృష్టిస్తోంది. జులై 3 నుంచి ఈ చిత్రం ప్రముఖ ఓటీటీ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమిగ్ అవుతోంది. ఓటీటీ ప్రేక్షకులు కూడా ఈ చిత్రానికి బ్రహ్మరథం పడుతున్నారు. నెట్‌ఫ్లిక్స్ ట్రెండింగ్ టాప్ 1, 2 పొజిషన్లలో మేజర్ కొనసాగుతుంది. 'మేజర్' హిందీ వెర్షన్ టాప్ 1లో ట్రెండ్ అవుతుండగా, తెలుగు వెర్షన్ రెండో స్థానంలో ఉంది. ఇండియాలోనే కాకుండా పాకిస్తాన్‌లో కూడా 'మేజర్' చరిత్ర సృష్టిస్తున్నాడు. అక్కడ కూడా నెట్‌ఫ్లిక్స్‌లో అత్యధికంగా వీక్షించిన సినిమాల్లో మేజర్ మొదటి స్థానంలో ఉంది. బంగ్లాదేశ్, శ్రీలంకలో కూడా ఈ చిత్రం టాప్ 1లో ఉండడం గమనార్హం. మహేశ్‌బాబు జీఎమ్‌బీ ఎంటర్‌టైన్మెంట్, ఏ ప్లస్ ఏస్ మూవీస్‌తో కలిసి సోనీ పిక్చర్స్ ఫిల్మ్స్ ఇండియా నిర్మించిన ఈ చిత్రంలో సయీ మంజ్రేకర్, శోభిత ధూళిపాళ హీరోయిన్స్‌గా నటించగా, ప్రకాశ్ రాజ్, రేవతి ఇతర కీలక పాత్రలు పోషించారు. శ్రీచరణ్ పాకాల సంగీతం అందించారు.

## గార్గితో వస్తోన్న సాయిపల్లవి ఆకట్టుకునేలా డైలాగ్‌లు



'విరాటపర్వం' చిత్రంతో ఆకట్టుకున్న సాయిపల్లవి, నెల రోజులు తిరక్కుండానే 'గార్గి' సినిమాతో ప్రేక్షకుల ముందుకొస్తోంది. గౌతమ్ రామచంద్రన్ డైరెక్ట్ చేసిన ఈ లేడీ ఓరియెంటెడ్ మూవీ జులై 15న తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో విడుదల కాబోతోంది. ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. 'నేనొక టీచర్‌ని, ఒక్కరోజులో మా జీవితాలు తల్లక్రిందులయ్యాయి. నాన్నని పోలీసులు అరెస్ట్ చేశారు. ఏ స్టేషన్‌లో ఉంచారో కూడా తెలియలేదు' అంటూ సాయిపల్లవి చెప్పే డైలాగ్స్‌తో కథని, ఆమె పాత్రని పరిచయం చేశారు. కచ్చితమైన ఆధారాలున్నాయంటున్నారు పోలీసులు. కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. కానీ వాదిస్తోన్నది మాత్రం ఓ జూనియర్ లాయర్. దాంతో ఒక్క అడుగు ముందుకేస్తే నాలుగు అడుగులు వెనక్కు పడుతున్నాయి. ఇంట్లోనూ ఆమెకు సపోర్ట్ లేదు. తలరాత ఎలా ఉంటే అలా జరుగుతుందని చెప్తోంది తల్లి. 'రాత, విధి, టైమ్ లాంటివన్నీ నమ్ముతావమ్మా.. నన్ను మాత్రం నమ్మవు.. ఎందుకంటే నేను మగ పిల్లాడిని కాదుగా' అంటూ సాయిపల్లవి వాపోతోంది. మరి చివరికి ఏం జరిగింది, ఆమె తన తండ్రిని కాపాడుకోగలిగిందా లేదా అనేది మిగతా కథ. ట్రైలర్ ఎంతో ఎమోషనల్‌గా సాగింది. తండ్రి కోసం న్యాయపోరాటం చేస్తున్న కూతురిగా సాయిపల్లవి నటన ఇంప్రెసివ్‌గా ఉంది. తమిళంలో హీరో సూర్యకి చెందిన 2డి ఎంటర్‌టైన్మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని విడుదల చేస్తోంది. తెలుగులో సురేష్ ప్రొడక్షన్స్, గ్లోబల్ సినిమాస్ డిస్ట్రిబ్యూట్

## ప్రభాస్ సరసన హీరోయిన్‌గా కరీనా..

### స్పిరిట్ చిత్రం కోసం ఎంపికచేసినట్లు వార్తలు

ప్రభాస్ ప్రస్తుతం వరుస పాన్ ఇండియా సినిమాలతో బిజీ బిజీగా గడుపుతున్నాడు. ప్రభాస్ ప్రస్తుతం ఒక భారీ హిట్టు కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ క్రమంలోనే షూటింగ్ కాస్త లేటైనా పర్లేదు కాని అవుట్ పుట్ మాత్రం బాగుండాలి అని దర్శకులకు చెప్తున్నాడట. ప్రస్తుతం ప్రభాస్ చేతిలో నాలుగు సినిమాలున్నాయి. అందులో 'ఆదిపురుష్' షూటింగ్ పూర్తి చేసుకోగా.. 'సలార్', 'ప్రాజెక్ట్-ఐ' షూటింగ్ దశలో ఉన్నాయి. వీటి తర్వాత ప్రభాస్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' చిత్రాన్ని చేయనున్నాడు. ప్రభాస్‌కు ఇది 25వ సినిమా కావడం విశేషం. ప్రభాస్ కోసం సందీప్ ఒక పవర్ ఫుల్ పోలీస్ క్యారెక్టర్‌ను డిజైన్ చేశాడట. ప్రస్తుతం సందీప్, రణ్‌బీర్‌తో 'యానిమల్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. రష్మిక హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుంది. గ్యాంగ్‌స్టర్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కనున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ద్వితియార్థంలో విడుదల కానుంది. ఈ చిత్రం తర్వాత స్పిరిట్ మొదలు కానుంది. ఇప్పటికే సందీప్ స్క్రిప్ట్‌ను కూడా సిద్ధం చేశాడని సమాచారం. అయితే తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త నెట్టింట వైరల్‌గా మారింది. ఈ చిత్రంలో ప్రభాస్‌కు జోడీగా బాలీవుడ్ బ్యూటీ కరీనా కపూర్‌ను ఎంపిక చేసే పనిలో సందీప్ ఉన్నాడట. ఇప్పటికే కరీనాతో చర్చలు జరుపగా.. త్వరలోనే తన నిర్ణయం చెప్తానని తెలిపినట్లు టాక్. ఇందులో నిజమెంతుందో తెలియాలంటే మాత్రం ఇంకొన్ని రోజులు వేచి చూడాల్సిందే. అయితే దీనిపై ప్రభాస్ ఫ్యాన్స్ మాత్రం విభిన్న భావాలు వ్యక్తపరుస్తున్నారు. ప్రభాస్‌కు కరీనా సెట్ కాదని, వీరిద్దరూ స్క్రీన్‌పై కనిపిస్తే అక్కా, తమ్ముడు లాగా ఉంటుందని అభిప్రాయ పడుతున్నారు. అంతేకాకుండా సందీప్‌ను ట్యాగ్ చేస్తూ ప్రభాస్‌కు వేరే హీరోయిన్‌ను చూడమని.. ఆయన క్రేజ్‌కు తగ్గ హీరోయిన్‌ను ఎంపిక చేయమని అభిమానులు కోరుతున్నారు.



## టాలీవుడ్ డైరెక్టర్‌తో శివ కార్తికేయన్ సినిమా

మరో టాలీవుడ్ డైరెక్టర్‌తో శివ కార్తికేయన్ సినిమా చేయబోతున్నట్టుగా ప్రస్తుతం సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. తమిళ స్టార్ హీరోలు రజినీకాంత్, కమల్ హాసన్ , అజిత్ , విజయ్ , సూర్య , కార్తి , ధనుష్ ల రూట్‌లోనే శివ కార్తికేయన్ కూడా తాను నటించిన సినిమాలను తెలుగులోనూ అనువాదం చేసి ఇక్కడి ప్రేక్షకులకు బాగా దగ్గరయ్యాడు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం తెలుగు, తమిళ భాషలలో తెరకెక్కుతున్న సినిమాలో నటిస్తున్నాడు. ఈ సినిమాకు 'జాతిరత్నాలు' ఫేమ్ కెవీ అనుదీప్ దర్శకత్వం వహిస్తున్నాడు.ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అయితే, శివ కార్తికేయన్ మరో తెలుగు సినిమాలో నటించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు ఇప్పుడు నెట్టింట వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ సినిమాకి 'సోగ్గాడే చిన్ని నాయన', 'బంగార్రాజు' సినిమాలతో హిట్స్ అందుకున్న టాలెంటెడ్ డైరెక్టర్ కళ్యాణ్ కృష్ణ కురసాల దర్శకత్వం వహిస్తున్నట్లు సమాచారం. ఇక ఈ సినిమాను కోలీవుడ్ అగ్ర నిర్మాత కే.ఇ. జ్ఞాన్ వేల్ రాజా ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ చిత్రానికి గాను శివ కార్తికేయన్ ఏకంగా 20 కోట్ల పారితోషికం అందుకుంటున్నట్టుగా ప్రచారం జరుగుతోంది. మరి ఈ ప్రాజెక్ట్ అధికారికంగా ఎప్పుడు ప్రకటిస్తారో చూడాలి. ఈ మధ్య కాలంలో శివ కార్తికేయన్ హీరోగా నటించిన 'డాక్టర్ జీ', 'డాన్' చిత్రాలు మంచి సక్సెస్ సాధించాయి. ఇక తెలుగులో మొదటిసారి సినిమా చేస్తున్న ఈ కోలీవుడ్ హీరోకు ఎలాంటి సక్సెస్ దక్కుతుందో తెలియాలంటే మూవీ విడుదలయ్యేవరకు వెయిట్ చేయాలి.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA, Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in